క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం



విశేష అలంకరణలో గోదా రంగనాయకులస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో బుధవారం శ్రీ గోదా రంగ నాయకులస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు.

27న సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 27న ఎంపీపీ తాతం జగన్మోహన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

29న తలుపులలో..

తలుపుల: ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, ఏఓ రామానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు.

బాలికలకు వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం- 2లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని కిశోర బాలికలకు వ్యాసరచన, బొమ్మలు గీయడం పోటీలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లలితమ్మ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బాలికలకు బహుమతులను ప్రదానం చేశారు. మహిళా పోలీసు జ్యోతిర్మయి, కార్యకర్తలు భారతి, జయలక్ష్మి, హరిత, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

తనకల్లు: కనసానివారిపల్లి వద్ద వెలసిన గంగమ్మ తల్లికి ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంజీ రెడ్డితో పాటు పలు గ్రామాల ప్రజలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తాదులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు, ప్రజలకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారేపల్లి నరసింహారెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, ప్రభావతి, రెడ్డిశేఖర్‌రెడ్డి, పుష్పవతి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గుట్టకిందపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి రామన్న రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. గుట్టకిందపల్లి గ్రామానికి చెందిన రామన్న బుధవారం రాత్రి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామన్నకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'రైతు విజయ సంకల్ప పాదయాత్ర'కు తరలిరండి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేపట్టిన 'రైతు విజయ సంకల్ప పాదయాత్ర'కు తరలిరావాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బుక్కపట్నంలో రైతులు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. బుక్కపట్నం మండలంలోకి శుక్రవారం (26న) ఎమ్మెల్యే అడుగు పెడుతున్నారన్నారు. పెద్ద ఎత్తున స్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొనాలని ఎంపీపీ సూచించారు.

పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాను ఇస్తున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాల గుండ్లపల్లి, వెంకటతిమ్మాపురం, నడిమిగడ్డపల్లి, నడిమిగడ్డపల్లి తండా, దర్శనమల గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామాలలో అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు హారతులు పట్టి ఆయనను ఆశీర్వదించారు. ఇంటింటా తిరుగుతు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం జరిగిందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుకు తీసుకొచ్చి ప్రత్యేక గుర్తింపు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలు ఆర్థికంగా జీవనోపాధులను పొందుతుంటే జీర్ణించుకోలేని చంద్రబాబు, పచ్చ పత్రికలు విషం కక్కుతున్నాయన్నారు. చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే అందాయన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు లంచాలు తీసుకొని అనర్హులకు సంక్షేమ పథకాలు అందించి అర్హులకు అన్యాయం చేశారన్నారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించి పేద ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నాడన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ప్రతాప్‌రెడ్డి, పాటిల్ చెన్నక్రిష్ణారెడ్డి, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ మాలగుండ్లపల్లి కేశవరెడ్డి, గొట్లూరు సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, రేగాటిపల్లి సురేష్‌రెడ్డి, ఓబిరెడ్డి, నాయకులు గొట్లూరు సంగాలప్ప, వెంకటతిమ్మాపురం లక్ష్మీనారాయణరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఓబిరెడ్డి, ముక్కర వాసు, వెంకటస్వామి, నారాయణస్వామి, అంజిన్‌రెడ్డి, కొండన్న, చెన్నప్ప, శ్రీనివాసులు, శివారెడ్డి, దర్శనమల, వెంకటతిమ్మాపురం, నడిమిగడ్డపల్లి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్నన్న ఎమ్మెల్యే

సమష్టి కృషితో మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో మండలాన్ని అభివృద్ధి చేసి చూపించామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ రాము అధ్యక్షతన నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవిడ్ వంటి క్లిష్ట సమయాలలో కూడా ముఖ్యమంత్రి చొరవతో అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను అందించామని పేర్కొన్నారు. ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20లక్షల నిధులు మంజూరు చేసిందని, వీటి ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తయ్యాయని, వచ్చే సంవత్సరం నుంచి అన్ని చెరువులకు నీళ్లు నింపుతామన్నారు. ప్రభుత్వానికి ఎక్కడా చెడ్డపేరు లేకుండా అంకితభావంతో విధులు నిర్వహించి నాలుగున్నర సంవత్సరాలు తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఎంపీటీసీలు సరస్వతి, తిమ్మారెడ్డి, క్రిష్ణమ్మ, సర్పంచులు ఆంజినమ్మ, రాధ, విష్ణుమూర్తి, నాగమునీశ్వర నాయుడు, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓఆర్డీ మనోహర్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి
- 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం అర్బన్: క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రభుత్వం తరపున ప్రోత్సాహం అందిస్తున్నామని ఆర్డీఓ రమేష్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. 'ఆడుదాం ఆంధ్ర' నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వారు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ధర్మవరం పట్టణం, రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు సంబంధించిన మహిళలకు 5 క్రీడా పోటీలు, పురుషులకు 5 క్రీడా పోటీలు నిర్వహించామని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాట్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి, మంచి భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర'ను ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణలో డ్రైవర్లదే కీలకపాత్ర



డ్రైవర్లను సన్మానిస్తున్న డీపీటీఓ మధుసూదన్



కదిరిలో రహదారి నిబంధనల కరపత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు

కదిరి అర్బన్: ప్రమాదాల నివారణలో డ్రైవర్లదే కీలకపాత్ర అని ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ పేర్కొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం రవాణా శాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఎంవీఐ వరప్రసాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓతో పాటు డీఎస్పీ శ్రీలత ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రహదారి సూచనలు పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. లైసెన్స్ లేనిదే వాహనం నడపరాదన్నారు. అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. సుమారు 50 వాహనాలతో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా డ్రైవర్ల దినోత్సవం..

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం డీఎం మైనోద్దీన్ ఆధ్వర్యంలో డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలోని 197 మంది డ్రైవర్లకు గులాబీ పువ్వు ఇచ్చి అభినందించారు. నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా డ్రైవర్లు తీసుకెళ్తున్నారని చెప్పారు. ఆర్టీసీ పురోగతి తమ పురోగతిగా భావిస్తూ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్, హరిత, కంట్రోలర్ ఉత్తన్న, ఎన్ఎంయూ నాయకులు బైరిశెట్టితో పాటు పలువురు పాల్గొన్నారు.

డ్రైవర్ల పాత్ర కీలకం

పుట్టపర్తి టౌన్: ప్రయాణికులను సురక్షితంగా తీసుకెళ్లడంలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి బస్ స్టేషన్‌లో ప్రయాణికులు, డ్రైవర్ల ఆధ్వర్యంలో డ్రైవర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డీపీటీఓ మధుసూదన్, అసిస్టెంట్ మేనేజర్ ఉషారాణి పాల్గొని డ్రైవర్లకు గులాబీ పువ్వు ఇచ్చి, పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణమంటే ప్రజలకు భరోసా అని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, సూపరింటెండెంట్ ఆర్‌కే రెడ్డి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు ఫక్రోద్దీన్, ప్రధానకార్యదర్శి జింకల రామన్నతో పాటు పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు.

ఓడీచెరువు క్రీడాకారుల ప్రతిభ



జిల్లాస్థాయికి ఎంపికైన షటిల్ క్రీడాకారులు కిశోర్ ,తిలక్



వాలీబాల్ జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారుల జట్టు

ఓడీచెరువు: పుట్టపర్తి నియోజక వర్గస్థాయి క్రీడా పోటీల్లో మండలానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పురుషుల షటిల్ బాడ్మింటన్, మహిళల వాలీబాల్ జట్లు నియోజక వర్గస్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీడీ గోపీనాథ్ తెలియజేశారు. క్రీడాకారులను ఎంపీడీఓ సిద్దారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస రెడ్డి అభినందించారు. జిల్లా స్థాయిలో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను కోరారు.

నేటి నుంచి కల్చరల్ ఫెస్ట్



మాట్లాడుతున్న 'బెస్ట్' ఛైర్మన్ భరత్ లాల్ మీనా

పుట్టపర్తి అర్బన్: యువతకు సంస్కృతీ సంప్రదాయాల విశిష్టత తెలియజేసే ఉద్దేశంతో గురువారం నుంచి 'ఇండియా–జార్జియా కల్చరల్ ఫెస్ట్' కార్యక్రమాన్ని 5 రోజుల పాటు నిర్వహించనున్నట్లు బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. పుట్టపర్తిలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. ఇండియా, జార్జియా దేశాల సాంస్కృతిక వారసత్వం, కళల ప్రదర్శన, సాంస్కృతిక సంభాషణలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో కార్యక్రమాన్ని వీక్షించడానికి భారత ఫౌండేషన్ అధ్యక్షులు రామ్‌మాధవ్, అంబ్‌కే దేవల్, జాయింట్ సెక్రెటరీ సురేష్‌బాబు, సుదర్శన్, రమీ దేశాయ్ బెస్ట్ ఛైర్మన్ భరత్ లాల్ మీనా, అంబ్ తదితరులు పాల్గొంటారన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

బత్తలపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నారని డి.చెర్లోపల్లి ఎంపీటీసీ సభ్యురాలు యం.సుజాత తెలిపారు. బుధవారం మండలంలోని నల్లబోయనపల్లి పంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. నల్లబోయనపల్లి పంచాయతీలో 29 సంఘాల్లో 284 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా కింద రూ.1.33 కోట్ల రుణమాఫీ జరిగిందని వివరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సీసీ నాగానంద తదితరులున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

ధర్మవరం అర్బన్: పార్థసారథినగర్-2లో నివసిస్తున్న పోతలయ్య అనారోగ్యంతో ఈనెల 22న మృతి చెందాడు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ మృతుని భార్య భాగ్యలక్ష్మికి అందించారు. బీమా రూ.లక్ష క్లెయిమ్ చేయించామని కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శి సాయిప్రకాష్, సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

గాండ్లపెంట: మండలంలో దివ్యాంగుల భవనం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని మండల జీవనజ్యోతి దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మస్తాన్ ఖాన్ కోరారు. బుధవారం తహసీల్దార్ హమీద్‌బాషాకు వినతి పత్రం అందించారు. మండల వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు నెలవారీ సమావేశాలు నిర్వహించుకుంటామన్నారు.

పాఠశాలకు కలర్ ప్రింటర్ వితరణ



కలర్ ప్రింటర్ అందిస్తున్న మక్బూల్ యువసేన సభ్యులు

గాండ్లపెంట: కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ తరఫున యువసేన సభ్యులు బుధవారం కటారుపల్లి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు కలర్ ప్రింటర్‌ను వితరణ చేశారు. పక్షం రోజుల క్రితం గాండ్లపెంట, ఎన్‌పీ కుంట మండల ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా మోడల్ బుక్‌లెట్లు అందించామన్నారు. మక్బూల్ అహమ్మద్‌కు, యువసేన సభ్యులు ఆసిఫ్, షౌకత్‌అలీ విద్యార్థులు, టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.

26న రథోత్సవం

అమడగూరు: అనంతపురంలో ఈ నెల 26న జరిగే శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ రథోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐబీఎస్ఎస్ (ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం) నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కొట్టువారిపల్లిలో పోస్టర్లను విడుదల చేశారు. బంజారాలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రమణానాయక్, మహిళా అధ్యక్షురాలు రత్నాబాయ్, భాస్కర్‌నాయక్, రమేష్‌నాయక్, సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల సర్వతోముఖాభివృద్ధితోనే దేశ పురోగతి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు

ధర్మవరం అర్బన్: బాలికల సర్వతోముఖాభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. పట్టణంలోని సూర్యస్కూల్‌లో బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కార దిశగా అందరూ కృషి చేయాలనే భారత ప్రభుత్వం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తలుపుల మండలంలో..

తలుపుల: మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో బుధవారం ఎస్ఓ మోహనమ్మ అధ్యక్షతన జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ నీహారిక మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ, ఆరోగ్యపోషణ, హక్కులు, తదితర అంశాలపై వివరించారు.

తనకల్లులో..

తనకల్లు: మండల కేంద్రంలోని కేజీబీవీ, కొక్కంటి గ్రామాలలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ గంగరత్నమ్మ మాట్లాడుతూ బాలికలు విద్యతోనే అత్యున్నత స్థానాలకు చేరుకోగలరని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఆయా గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వైవీ కౌసల్య, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, జయమ్మ పాల్గొన్నారు.

బాలికలను చదివిద్దాం

ధర్మవరం అర్బన్: బాలికలను రక్షిద్దాం, చదవనిద్దామని సీడీపీఓ లక్ష్మి తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ అమ్మాయిలను అబ్బాయిలను సమానంగా చూడాలని సూచించారు. ఆడపిల్లలను బాగా చదివించాలని తెలిపారు. భ్రూణ హత్యలను నివారించాలని, బాల్య వివాహాలు చేయకూడదని తెలిపారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు సుశీలమ్మ, ఉమాపతి, సూపర్‌వైజర్ లతాకిరణ్మయి, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు మౌలాబి, రామలక్ష్మి, ప్రభావతిలు హాజరై మాట్లాడారు. బాలికకు 18 ఏళ్లు దాటాకనే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే రూ. లక్ష జరిమానాతో పాటు 6 నెలల జైలు శిక్ష విధిస్తారని చెప్పారు. బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు దివ్యతో పాటు పలువురు అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

పుట్టపర్తి అర్బన్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని డీఎస్పీ వాసుదేవన్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలికలు తాము ఎంచు కున్న లక్ష్యాన్ని చేరే విధంగా ముందుకు సాగాలన్నారు. బాలికల పరిరక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు శివరంగ ప్రసాద్, మోహన్‌రాం, డీసీపీఓ మహేష్, సీఐ రామయ్య, బాలికల పరిరక్షణ అధికారి నాగలక్ష్మి, మురళీ, సునీత, రెడ్స్ ప్రతినిధి కొండప్ప, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

పుట్టపర్తి టౌన్: వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో కానిస్టేబుల్ నాగభూషణ భార్య రామాంజనమ్మకు, హరికుమార్ భార్య పద్మజకు రూ. 1.25 లక్షల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం

ధర్మవరం రూరల్: ధర్మవరం మండలం మల్లేనిపల్లికి చెందిన లక్ష్మీదేవి (67) అనే మహిళ మృతి చెందింది. విశ్వదీప సేవా సంఘం వారు బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, మృతురాలి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా నేత్రదాత కుమారులు హనుమంతు, వెంకటేష్, కోడళ్లు పార్వతి, నాగలక్ష్మికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉరుసు నిర్వహణకు విరాళం

తలుపుల: కుమ్మరపేటలో నిర్వహించే బాబా షర్ఫోద్దీన్ ఉరుసుకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని దర్గా కమిటీ, కన్వీనర్ పయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫీనాయక్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉరుసు నిర్వహణకు ఎమ్మెల్యే రూ.50 వేల విరాళం అందజేశారు. ఎమ్మెల్యేకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి అదృశ్యం

తలుపుల: మండలంలోని బట్రేపల్లికి చెందిన కొమ్మెర క్రిష్ణ కుమారుడు కొమ్మెర గురురాజా (22) అనే యువకుడు రెండు రోజులుగా కనిపించలేదు. ఆయన తల్లి వెంకటలక్ష్మమ్మ బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మగ్బుల్ బాష తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఎన్‌పీకుంట: మండలంలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ సాలేహాబాషా బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు వివరించారు.